కడప తాలూకా పరిధిలోని బాలాజీనగర్‌లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయిస్తున్న పోలీసులు



మద్యం తాగితే కఠిన చర్యలు

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప(క్రైం), ఆగస్టు 18: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించడం చట్ట వ్యతిరేకమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. ఆ మేరకు జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 15 రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 1064 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో కడప సబ్ డివిజన్ పరిధిలో 155 మందిపై కేసులు, మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో 311 మందిపై, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో 232 మందిపై, పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలో 182 మందిపై, జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో 184 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను పోలీసు అధికారులు, సిబ్బంది గుర్తించి పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సిబ్బంది సహకారంతో స్వయంగా శుభ్రం చేయించారు. ఫలితంగా బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలు కనుమరుగై నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్పీ ఆకాంక్షించారు.

కృష్ణానది బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి

● తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 18: కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటుచేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీలో ఏర్పాటు చేయాలి, పదేళ్లు దాటినా ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉడడం శోచనీయమన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆధ్వర్యంలో గోదావరి నది మీద ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రికి సమీపాన నిర్మాణం జరుగుతోందని, కార్యాలయం కూడా ప్రాజెక్టు సమీపంలో రాజమండ్రిలో ఉండాలన్నారు. ఈ కార్యాలయాల ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే దిగువన నీటి అవసరం లేకపోయినా జలవిద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 6.25 టీఎంసీల నీరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు ఉపయోగిస్తున్నాయన్నారు. అయితే ఆ నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు వాడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ పూర్తి సామర్థ్యం 44 వేల క్యూసెక్కులు ఉందని, కానీ ప్రస్తుతం 25 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారన్నారు. ఈ ప్రకారం అయితే రాయలసీమలోని గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం, పైడిపాళెం, సీబీఆర్ తదితర రిజర్వాయర్లు నిండవని తెలిపారు.

నిలిచిన ముగ్గురాళ్ల రవాణా

● రైల్వేకోడూరులో లారీల యజమానుల నిరసన

రైల్వేకోడూరు, ఆగస్టు 18: మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో ముగ్గురాళ్ల రవాణా ఆగిపోవడంతో సిబ్బందితో పాటు తాము ఉపాధి కోల్పోయామని లారీల యజమానులు ఆదివారం నిరసనకు దిగారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పాపాలు మూటగట్టుకున్న ప్రజాప్రతినిధులపై నిగ్గు తేల్చాలని, మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను కూటమి ప్రభుత్వం లోతుగా విచారిస్తున్న సందర్భంలో రవాణాను ఆపేసిన విషయం విదితమే. దీనిపైన ఆధారపడిన లారీల యజమానులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రైల్వేకోడూరులో లారీల యజమానులు, సిబ్బంది కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీల యజమానులు వేమల సభాపతి, జగత్పతి, కేశవులు మాట్లాడుతూ మంగంపేట ముగ్గురాళ్లు, పౌడర్‌లను లారీల్లో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం క్రిష్ణపట్నం పోర్టుకు, తమిళనాడు చెన్నై హార్బర్‌కు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. 18 టైర్ల లారీలు కనీసం 300 లారీలు ఉన్నాయన్నారు. నెలకు 1.50 లక్షల టన్నుల వరకు చెప్పిన సమయంలో రెండు హార్బర్లకు 15 ఏళ్లుగా ఎగుమతి చేసి ఉపాధి పొందుతున్నామని తెలిపారు. ఈ లారీలు మంగంపేట ముగ్గురాయి, పౌడరు మాత్రమే ఎగుమతికి పనికి వస్తాయన్నారు. వేరే లోడింగ్‌కు పనికి రావని తెలిపారు. 120 మంది లారీల యజమానులు ఉన్నారన్నారు. ముగ్గురాళ్లు, పౌడర్ ఎగుమతి చేయడానికి లారీలను వివిధ కంపెనీల దగ్గర ఫైనాన్స్ తీసుకుని ఉన్నామని తెలిపారు. బెరైటీస్ ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. లారీలకు తెచ్చుకున్న ఫైనాన్స్‌ను కూడా కట్టుకోలేక కష్టాలు పడుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిందని, తమ ఇబ్బందులు పోతాయని అనుకున్న సమయంలో రాయి రవాణా నిలిపివేశారన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు వినతిపత్రం పంపామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, చాంద్‌బాషా, సునీల్, మణి, నవీన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరులో ఆందోళన చేస్తున్న లారీల యజమానులు

ఉడత చెప్పే ఊసులెన్నో..!

వెయ్యి పదాలు చెప్పలేని సారాంశాన్ని ఈ చిత్రాలు చెబుతాయి. ఇవి చూస్తే మనసులో ఎన్నో భావాలు పెల్లుబికుతాయి. అలాంటి చిత్రాలను కెమెరా క్లిక్‌మనిపిస్తే ఎంత అందంగా ఉంటుందో కదా.. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మీకోసం. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్



హాయ్.. నాకు ఫుడ్ దొరికింది



ఆహా... ఆహారం ఆరగించేస్తా..



త్వరగా తినేద్దాం



హమ్మయ్యా.. కడుపు నిండిపోయింది

వైసీపీ ఐదేళ్ల పాలన సర్వం కబ్జాలమయమైంది. జిల్లాలో ఏదోక చోట భూముల ఆక్రమణ సర్వసాధారణంగా జరిగిపోయింది. కొండలు, వాగులు, వంకలు ఆక్రమించేశారు. అడిగేవారే లేకుండా పోయారు. మామూలుగా డీకేటీ భూములను కొనడం, అమ్మడం నేరం. అయితే అవన్నీ సాధారణ జనానికి, ప్రతిపక్షానికే... వైసీపీ నేతలకు అలాంటి నిబంధనలు ఉండవంటూ వ్యవహరించారు. అంతే.. కొందరు అడ్డగోలుగా పేదల పేరిట ఉన్న అసైన్డ్, నిషేధిత భూములను కొట్టేశారు. కోట్లు వెనకేసుకుని దర్జాగా తిరుగుతున్నారు. కాగా మదనపల్లె ఘటనతో ప్రభుత్వం అప్రమత్తమై ఫ్రీహోల్డ్ భూముల గోల్‌మాల్ నిగ్గుతేల్చాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకుగానూ పైలెట్ ప్రాజెక్టుగా మైదుకూరును ఎంపిక చేసి విచారణను ప్రారంభించారు. దీంతో ఆక్రమణదారుల్లో వణుకు మొదలైంది.



కడప ఫైల్స్

- వైసీపీ హయాంలో భారీగా భూఆక్రమణలు
- పేదల పేరిట అసైన్డ్, నిషేధిత భూములు కొట్టేసిన వైనం
- మదనపల్లె ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం
- ఫ్రీహోల్డ్ భూముల గోల్‌మాల్ నిగ్గు తేల్చాలని నిర్ణయం
- పైలెట్ ప్రాజెక్టుగా మైదుకూరు ఎంపిక
- విచారణలో బయటపడుతున్న అక్రమాలు
- పేరుకే పేదలకు.. భూములన్నీ పెద్దలకు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కడప ఫైల్స్ వ్యవహారం పెద్ద చర్చనీయాంశమైంది. పేదలకు ఇచ్చిన భూములకు 20 ఏళ్లు పూర్తయిన వాటికి సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో నిషేధిత జాబితా 22ఏ నుంచి అసైన్డ్, చుక్కల భూముల షరతులు తొలగిపోయాయి. పట్టాభూములు మాదిరిగానే హక్కులు పొందే అవకాశం వచ్చింది. వాటిని క్రయ, విక్రయాలు చేసుకునేందుకు అనుమతిచ్చారు. అసైన్డ్ భూములు అమ్ముకునే చట్టం తెస్తున్నారని కొందరు వైసీపీ నేతలకు ముందుగానే సమాచారం ఉంది. అంతే.. కొందరు ఇష్టారాజ్యంగా డీకేటీ భూములను కొనుగోలు చేశారు. మరికొన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. వెరశి.. జిల్లాలో 1,48,987 ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించబడ్డాయి. అయితే ఇవన్నీ క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. వీటిలో కొన్ని జెన్యూన్ భూములుండగా మరి కొన్ని డీకేటీ భూముల కొనుగోలు, కొన్ని రికార్డుల్లో పేర్లు మార్చి ఫ్రీహోల్డ్‌లోకి తెచ్చుకున్నారంటారు. నిషేధిత జాబితా నుంచి 1,48,987 ఎకరాలు తొలగించగా వాటిలో 34560.9 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగాయి. నిషేధిత జాబితాలో తొలగింపుపై పెద్ద దుమారం రేగింది. అయితే ఈ నేపథ్యంలో మదనపల్లెలో సబ్ కార్యాలయం రికార్డులు కాల్చివేత ఒక్కసారిగా సంచలనం సృష్టించింది. భూ ఆక్రమణలు బయట పడకుండా ఉండేందుకే వైసీపీ నేతలు అధికారులతో కలిసి ఏకంగా సబ్ కలెక్టరేట్‌కే స్పాట్ పెట్టారంటారు. ఈ సంఘటనతో ప్రభుత్వం అలర్ట్ అయింది. జగన్ హయాంలో నిషేధిత జాబితాలో తొలగించి ఫ్రీహోల్డ్ ఇచ్చిన భూములపై మూడునెలల పాటు రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో పాటు వాటిపై విచారణ జరపాలని నిర్ణయించింది. జిల్లాలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల్లో మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో ఎక్కువగా ఫ్రీహోల్డ్ భూములున్నట్లు గుర్తించారు. దీంతో పైలెట్ ప్రాజెక్టుగా మైదుకూరును ఎంపిక చేశారు. మైదుకూరులో 3100 ఎకరాలతో ఫ్రీహోల్డ్ ఇచ్చారు. దీంతో ఇక్కడ సర్వే చేస్తున్నారు. బద్వేలు, గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.మఠానికి చెందిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు ఇలా ఆరు టీంలు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా విచారణ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ అదితీసింగ్ ఈ విచారణను పర్యవేక్షిస్తున్నారు.

అక్రమాలు వెలుగులోకి

భూమిలేని నిరుపేదల కోసం ప్రభుత్వాలు డీకేటీ భూములు ఇచ్చాయి. అయితే వాటిని అమ్ముకోకూడదు. అమ్మినా, ఎవరన్నా కొన్నా నేరం. అయితే కొన్ని విలువైన భూములను జగన్ హయాంలో వైసీపీ నేతలు వశపరుచుకున్నట్లు చెబుతారు. అలాంటి భూములను ఇప్పుడు ఫ్రీహోల్డ్ పేరిట నిషేధిత జాబితాలో నుంచి తొలగించారు. ఇప్పుడు విచారణ బృందం విచారిస్తున్నారు. నిషేధిత జాబితా నుంచి ఎలాంటి భూములు తొలగించారన్న విషయం, నిబంధనల మేరకు జరిగాయా, భూమి ఎవరి పేరు మీద ఉంది, ఎవరు పొజిషన్‌లో ఉన్నారంటూ గ్రౌండ్ లెవెల్‌లో నాలుగు రోజులుగా రెవెన్యూ బృందం విచారణ చేస్తోంది. అయితే ఇక్కడ ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు జరిగాయని బయటకు వస్తున్నాయి. రికార్డుల్లో పేరు ఒకటి ఉంటే పొజిషన్‌లో వేరే వారు ఉన్నట్లు బయటపడుతోంది. పేరు మాత్రం పేదలది, సాగులో ఉండేది పెద్దలని తెలుస్తోంది. అంటే కొంతమంది నేతలు డీకేటీ భూములు కొనుగోలు చేశారు. రికార్డులు మాత్రం పేదల పేరుతో ఉన్నాయి. వాటిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించడంతో అవి ఇప్పుడు ఆ నేతల పేరుతో రిజిస్టరు కానున్నాయి. విలువైన భూములను పదో పరకో ఇచ్చి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఇలా ఫ్రీహోల్డ్ భూముల్లో గోల్‌మాల్ జరిగినట్లు విచారణలో బయటపడుతోంది. విచారణ పూర్తయితే ఎన్ని ఎకరాల్లో గోల్‌మాల్ జరిగిందీ మొత్తం వ్యవహారం బయటకు రానుంది. ఇప్పటికైతే దాదాపు 20 శాతం నిషేధిత భూముల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించినట్లు చెబుతున్నారు.

జిల్లాలో పెద్ద చర్చ

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ రికార్డులు దహనంతో వైసీపీ నేతల భూ ఆక్రమణలు పెద్ద చర్చనీయాంశంగా మారాయి. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు అటు వైసీపీ నేతలు, రెవెన్యూ కలిసి రికార్డులు కాల్చి ఆనవాళ్లు లేకుండా చేయాలనుకున్నారు. మదనపల్లె ఘటనతో మదనపల్లె ఫైల్స్ సినిమా తీయాలనే చర్చ నడిచింది. అయితే మన జిల్లాలో కూడా భారీ ఎత్తున భూ ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూ గోల్‌మాల్‌పై కడప ఫైల్స్ సినిమా తీస్తే అవసరమైన మెటీరియల్ ఉంటుందంటారు. జిల్లాలో కూడా ఫ్రీహోల్డ్ పేరిట భారీ సంఖ్యలో పేదల భూములను వైసీపీ నేతలు కొనుగోలు చేసిన భూములకు రిజిస్ట్రేషన్‌కు లైన్ క్లియర్ చేయించుకున్నారంటారు. పులివెందులలోనే పెద్దఎత్తున భూములు ఫ్రీహోల్డ్‌లోకి వచ్చాయంటారు. ఇక కడపలో సీకేదిన్నె రెవెన్యూ కీలకంగా ఉంది. కడపలో రిమ్స్, రింగురోడ్డు, మామిళ్లపల్లె, ఊటుకూరు, అటు పులివెందుల రోడ్డు, రాయచోటి రోడ్డు చుట్టూ భూములు ఉన్నాయి. ఇక్కడ ఎకరం రమారమి రూ.5 కోట్లు ఉంటుంది. ఇక్కడ ఫ్రీహోల్డ్‌లో కొన్ని భూములు బయటకు వచ్చాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా వైసీపీ నేతలు ఫ్రీహోల్డ్ పేరిట చక్కబెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. విచారణతో పైలెట్ ప్రాజెక్టుగా మైదుకూరు విచారణ పూర్తయితే నిషేధిత జాబితా భూముల గుట్టురట్టు కానుంది. ఇక జిల్లా వ్యాప్తంగా వాటిపై విచారణ జరుపుతారు. సెప్టెంబరులో భూగోల్‌మాల్‌పై రెవెన్యూ సదస్సులు కూడా నిర్వహించనుంది. మొత్తానికి అయితే మైదుకూరు ఫ్రీహోల్డ్ భూముల విచారణపై అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రెవెన్యూ బృందం ఒక చోట కూర్చుని కాకుండా రికార్డులు తీసుకుని గ్రామాలు, భూముల వద్దకు వెళ్లి విచారణ చేస్తున్నారు.



మైదుకూరులో విచారణ చేస్తున్న బద్వేలు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు బృందం

హిందువులపై సాగుతున్న దమనకాండ ఆపాలి

● హిందూ ఐక్యత ర్యాలీలో పలు హిందూ సంఘాల నాయకులు

కడప (కల్చరల్), ఆగస్టు 18: రిజర్వేషన్ల సాకుతో హిందువులపై బంగ్లాదేశ్‌లో సాగుతున్న దమనకాండను వెంటనే ఆపాలని పలు హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. కాదు, కూడదు.. అని మరింతగా రెచ్చిపోయి హిందువులపై దాడులకు తెగబడితే సహించేది లేదన్నారు. ఇందుకు నిరసనగా హిందూ సంఘాల సమన్వయంతో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి నగర అప్సర సర్కిల్, క్రిష్ణాసర్కిల్, ఏడురోడ్లకూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ చైతన్యవేదిక అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, రామమహేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, హిందూ సంఘాల నాయకులు విజయానందరెడ్డి, జనసేన నాయకుడు సుంకర శ్రీనివాస్, టీడీపీ నాయకుడు దుర్గాప్రసాద్‌లు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ఒక వర్గానికి చెందిన ముష్కరులు పనిగట్టుకుని మరీ హిందూ దేవాలయాలు, హిందువులు, హిందూ మహిళలపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ముష్కరుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన హిందువుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ముసుగులో బంగ్లాదేశ్‌లో అల్లకల్లోలం సృష్టించేందుకు హిందువులను పావులుగా వాడుకున్నారని నిప్పులు చెరిగారు. దాడుల్లో మహిళలు, బాలికలపై అకృత్యాలకు పాల్పడడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బంగ్లాదేశ్‌లో సాగుతున్న హింసాకాండను ఆపేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో యావత్ హిందువులను ఏకతాటిపైకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తుంగా రమణయ్య, భాస్కరవర్మ, శివకేశవ, ఏపీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, డాక్టర్ ఉరిమి జనార్ధన్, రామకృష్ణారెడ్డి, న్యాయవాది భారవి, రామమోహన్‌రెడ్డి, హిందూ సంఘాలు, బ్రాహ్మణ సంఘాల నాయకులు సతీష్ శశిధర్‌శర్మ, వారణాసి శ్రీధర్‌శర్మతో పాటు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీగా వస్తున్న హిందువులు

రూ.110 కోట్లు నీళ్లపాలేనా?

- మూడురోజులకు ఒకమారు కూడా సరఫరా కాని బ్రహ్మంసాగర్ నీరు
- నిరుపయోగంగా మారిన శుద్ధిజల భవనం
- శుద్ధి చేయకపోవడంతో.. ● నీటిని బయట కొనుగోలు చేస్తున్న జనం



నీటిని శుద్ధి చేసే యంత్రాలు లేక నిరుపయోగంగా ఉన్న భవనం

బద్వేలు రూరల్, ఆగస్టు 18: లక్ష పైబడిన జనాభా, అధికారికంగా 22వేల పైబడి గృహాలు, అనధికారికంగా మరో పదివేల గృహాలు, 35 వార్డులతో కూడుకుని ఉన్న బద్వేలు మున్సిపాలిటీలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రూ.110 కోట్లు ఖర్చు చేసి బ్రహ్మంసాగర్ నుంచి నీటిని అందించే ఏర్పాటు చేసినా.. ఈ నీటిని శుద్ధి చేయకపోవడంతో తాగడానికి పనికి రావడంలేదు. దీంతో ప్రజలు బయట డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి తలెత్తింది.

గతంలో తాగునీటి ఎద్దడి

దశాబ్దం కిందట కేవలం బద్వేలు పంచాయతీలో మూడు బోర్ల ద్వారా తాగునీరు అందించేవారు. మిగిలిన మడకలవారిపల్లె, గుంతపల్లె పంచాయతీల్లో నివసించే వారు బద్వేలు పంచాయతీ పరిధిలోని పోరుమామిళ్ల రోడ్డుకు వచ్చి సైకిళ్లలో తాగునీరు తీసుకెళుతుండేవారు. వేసవికాలం వస్తే ఇక్కడ కూడా బోరు మోటర్లు చెడిపోయి తాగునీరు సరఫరా ఆగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కమలమ్మ హయాంలో బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలుకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.110 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అప్పట్లో మొదలైన పనులు 2015 నాటికి పూర్తయి పట్టణ ప్రజలకు బ్రహ్మంసాగర్ నీటిని సరఫరా చేస్తున్నారు.

నిరుపయోగంగా శుద్ధి జల భవనం

బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు వద్ద శాండ్ (ఇసుక)తో మొదట నీటిని శుద్ధి చేసి.. పట్టణంలోకి వచ్చిన తరువాత చెన్నంపల్లె చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో శుద్ధి జల యంత్రాల ద్వారా రెండో దఫా నీటిని శుద్ధి చేసి బద్వేలు ప్రజలకు అందించాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం. ప్రారంభం అయిన రోజు నుంచి నేటి వరకు ప్రాజెక్టు వద్ద ఇసుకతో మాత్రమే నీటిని శుద్ధి చేస్తున్నారు. శుద్ధి చేసే భవనాన్ని నిర్మించారు తప్ప అందులో యంత్రాలు బిగించలేదు. దీంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది. రూ.110 కోట్లు వెచ్చించినా శుద్ధి చేసిన జలం అందకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మంసాగర్ నీరు తాగేందుకు ఉపయోగపడక పోవడంతో పట్టణంలోని ప్రజలందరూ డబ్బులు పెట్టి కొని నీటిని ఉపయోగించుకుంటున్నారు. దీంతో పట్టణంలో పుట్టగొడుగుల్లా తాగునీటి ప్లాంట్‌లు ఏర్పాటయ్యాయి.

మూడురోజులకు ఒకసారి..

బద్వేలు పట్టణంలో ప్రతిరోజూ దాదాపు 90 లక్షల లీటర్ల నీరు అవసరం. అందుకు గాను ఏడెనిమిది ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి ట్యాంకుల్లో నీటిని నింపి కొళాయిల ద్వారా సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం బ్రహ్మంసాగర్‌లో నీరు లేదన్న కారణం చూపుతూ మూడురోజులకు ఒకమారు కూడా నీటిని సరఫరా చేయలేని దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని తమకు బ్రహ్మంసాగర్ నుంచి శుద్ధి చేసిన నీటిని అందించాలని బద్వేలు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు



శుద్ధి చేసిన నీటినే అందించాలి..

రూ.110 కోట్ల నిధులు ఖర్చు పెట్టి బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు పట్టణానికి సరఫరా చేస్తున్న నీరు ప్రజలు తాగేందుకు ఉపయోగపడ్డం లేదు. ప్రాజెక్టు వద్ద తప్ప రెండో దఫా శుద్ధి చేయడంలేదు. దీంతో ఈ నీటిని ఎవ్వరూ తాగడం లేదు. ఇప్పటికైనా రెండో దఫా నీటిని శుద్ధి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- ఎస్.జహంగీర్‌బాషా, బద్వేలు

రోజూ నీటిని సరఫరా చేయాలి..

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో లక్షకు పైబడి జనాభా ఉన్నారు. బ్రహ్మంసాగర్ నుంచి నీరు ప్రతిరోజూ సరఫరా జరిగేలా చూడాలి. నీటి సరఫరా జరక్కపోతే ప్రజలు తమ నిత్యావసరాలకు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించింది. వెంటనే ప్రతిరోజూ నీరు సరఫరా జరిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.



- మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, బద్వేలు

పిల్లలకు ఇష్టమైన వాటిని అందించాలి

కడప బాలోత్సవంలో జేసీ అదితిసింగ్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేసీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18: పిల్లలకు ఇష్టమైన దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కడప బాలోత్సవం ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన జేసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాలు, కడప బాలోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. 200 ఏళ్లగా బ్రిటీషు వారు మనల్ని పాలించారని వారి నుంచి మన స్వాతంత్ర్య ఉద్యమ నేతలు విముక్తి కల్పించడానికి ఎందరో ప్రాణత్యాగాలు చేసిన విషయం గుర్తు చేశారు. ప్రతి పిల్లవాడికి ప్రాథమిక హక్కులు అంబేడ్కర్ సారథ్యంలో రచించిన రాజ్యాంగం అందించిందన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం అనుభవించే హక్కు మనకుందని, మన ఆరోగ్యమైన జీవితం కోసం మన చెత్తను ఇతరుల ఇంట్లో వేస్తే అది హక్కు దుర్వినియోగం చేసినట్లవుతుందన్నారు. మన ఆరోగ్యాన్ని మనం సంరక్షించుకుంటూనే ఇతరులకు ఇబ్బంది రాకుండా ఉండడమే మన విధి అని తెలిపారు. పిల్లలకు ఏది ఇష్టమైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి కావలసిన సహకారం అందించాలన్నారు. మనం ఏం చేయాలని నిర్ణయించుకుంటామో దానిని మన కెరీర్‌గా మలచుకోవాలని సూచించారు. అనంతరం వైవీయూ డైరెక్టర్ డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కడప ఎంఈఓ గంగిరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శనరెడ్డి, కడప బాలోత్సవ కమిటీ సభ్యులు రాజశేఖర్ రాహుల్, సునీత, సరస్వతి, మధుసూదన్, ఉషా, తులసి శివరాం తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జ్యోతిష్య శాస్త్రనిపుణులు సురేశ్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18: కడపనగరం ఎన్జీఓ కాలనీ ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ముద్దల సురేశ్‌బాబు, రేష్మ దంపతుల కుమార్తె సునీతషాహరోన్ 16వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం 400 మందికి పైగా పేద మహిళలకు చీరలు, కేక్‌లు పంపిణీ చేశారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, మరీముఖ్యంగా వస్త్రాలు దానం చేస్తే దేవునికి చేసినట్లేనని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయన్నారు. పెద్దలు చేసే దానాలతో పిల్లల్లో చాలా ప్రభావం చూపిస్తుందన్నారు. మన సంపాదనలో కొంత మేరకైనా అవసరంలో ఉన్న వారికి సహాయం చేస్తే దేవుని ఆశీస్సులు కలుగుతాయన్నారు. సమాజంలో కొంత మందికైనా ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజు, శ్యామల, రేచల్, మనోహర్, నిర్మల, సువార్త, శోభా,భారతి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు బిర..బిరా కృష్ణమ్మ

- వారం రోజుల్లో ఏడు టీఎంసీలు చేరిక
- నేడు సీబీఆర్, పైడిపాలెంకు నీరు విడుదల



గండికోట ప్రాజెక్టులోకి వేగంగా వస్తున్న కృష్ణమ్మ

కొండాపురం, ఆగస్టు 18: గండికోట ప్రాజెక్టులోకి కృష్ణమ్మ బిరబిరా పరుగులెడుతూ వస్తోంది. దాదాపు రోజుకు ఒక టీఎంసీ నీరు చొప్పున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఆగస్టు 10న అవుకు రిజర్వాయిర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయగా వారం రోజుల్లో ఏడు టీఎంసీల దాకా నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండడంతో గండికోటకు నీటిని వేగంగా విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయింత్రానికి గండికోట ప్రాజెక్టులో 8.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలవనరుల శాఖ ఛీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. దీంతో చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొండాపురం వద్ద ఉన్న రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్‌ల ద్వారా సోమవారం ఉదయం 9 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వెంటనే సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లకు నీటిని విడుదల చేస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ నుంచి వంద క్యూసెక్కులు : ఏఈఈ

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 18: బ్రహ్మంసాగర్ రిజర్వాయరు నుంచి కుడికాల్వ కింద ఉన్న రైతుల అభ్యర్థనల మేరకు వంద క్యూసెక్కులు నీటిని దిగువకు వదలినట్లు ప్రాజెక్టు ఏఈఈ ముద్దం నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుతం రైతన్నలు వరినాట్లు వేస్తున్న సందర్భంగా రైతన్నల అవసరాల నిమిత్తం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ సూచన, తెలుగుగంగ ఉన్నతాధికారుల అనుమతితో నీటిని దిగువకు వదిలినట్లు ఏఈఈ తెలిపారు. నీటిని పంటలకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కాల్వ పోరంబోకు స్థలం విక్రయం

చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



ప్రొద్దుటూరు ఆగస్టు 18: పట్టణ పరిధిలోని 35వ వార్డులోని దేవాంగకల్యాణ మండపం వెనుక వున్న మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలాన్ని ఆ వార్డుకు చెందిన ఓ మాజీ కౌన్సిలర్ విక్రయించినట్లు సమాచారం. గతంలో కాల్వ పోరంబోకు స్థలంలో అక్కడ వున్న కొందరు పేదలు గుడిసెలు వేసి ఆక్రమించారు. అందులో రెండు సెంట్లకు పైగావున్న స్థలాన్ని ఓ మాజీ కౌన్సిలర్ 2007లో ఒకరి నుంచి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంటు పుట్టించింది. అగ్రిమెంటు పెట్టుకుని నేడు ఆ స్థలం రూ.16 లక్షలకు విక్రయించినట్లు స్థానికులు వాపోతున్నారు. అది పేదల మున్సిపాలిటీ స్థలం అక్రమంగా అగ్రిమెంటు కాగితాలు పుట్టించి సొమ్ము చేసుకుంటు న్నట్లు వార్డు వాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది దృష్టికి ఈ కాల్వ పోరంబోకు మున్సిపల్ స్థలం ఖాళీగా వుండడం అది ఒక మాజీ కౌన్సిలర్ అధీనంలో వుండడంపై తెలిసి కూడా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం గానీ, అక్కడ బోర్డు పెట్టి పరిరక్షించడం గానీ చేయకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆ మాజీ కౌన్సిలర్ మున్సిపాలిటీ స్థలాన్ని విక్రయించి సొమ్ముచేసుకున్నట్లు వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే కోవలో మరిన్ని స్థలాలు ఆక్రమణకు గురైనా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో అవి అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ కాల్వ పోరంబోకు స్థలం విక్రయంపై మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ విషయం వారి దృష్టికి వచ్చినట్లు అంగీకరించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని పంపి సర్వేచేయించినట్లు తెలిపారు. త్వరలో అక్కడ కాల్వ పోరంబోకు స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలకు మార్కింగ్ ఇస్తామన్నారు. ఈ స్థలానికి మున్సిపల్ స్థలంగా బోర్డు పెడతామన్నారు. ఈ స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాలను నివృత్తి చేయండి

తల్లీబిడ్డల మృతిపై నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ ● పోలీసులను ప్రశ్నించిన వైనం

రాయచోటిటౌన్, ఆగస్టు18: స్థానిక తొగటవీధిలో శనివారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యర్రగుడి రమాదేవి(33) ఆమె ఇద్దరు బిడ్డల ఘటనపై ఉన్న అనుమానాలన్నింటినీ పోలీసులు నివృత్తి చేయాలని నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. రమాదేవి ఆమె ఇద్దరు పిల్లలు అనుమానాస్పద స్థితిలో కాలి బూడిదైన విషయంపై పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కుల సంఘం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, ఎంఆర్‌పీఎస్, రజక సంఘం నేతృత్వంలో ఏర్పడిన నిజనిర్ధారణ కమిటీ స్థానికులను, రక్త బంధువులు, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు, పోలీసులను విచారించి సంఘటనపై వాస్తవాలు తెలుసుకున్నట్లు నిజనిర్ధారణ కమిటీ బృందం నేతలు తెలియజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పిల్లలను ముందుగా చంపిన రమాదేవి తర్వాత గ్యాస్ లీక్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చి మృతురాలిపైనే హత్య కేసు నమోదు చేయడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. నిజంగా రమాదేవి ఆత్మహత్య చేసుకున్నది నిజమైతే మృతదేహం పక్కనే ఏ మాత్రం కాలని ప్లాస్టిక్ బాటిల్ ఉందని, దానిని పోలీసులు సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు, వేలిముద్రల నిపుణులకు పంపించాల్సిన పోలీసులు ఆ పని చేయలేదన్నారు. బెడ్ రూమ్‌లో గ్యాస్ లీక్ చేసి రమాదేవి చనిపోయింది నిజమైతే గదిలో ఉన్న బెడ్, ఇతర వస్తువులు ఏ మాత్రం కాలలేదని, గది అంతా గ్యాస్‌తో నిండిన తర్వాత నిప్పు అంటించుకుని ఉంటే రూమ్ గోడలు మసిబారి ఉండాలి కానీ అలాంటి ఛాయలు అక్కడ లేవన్నారు. బెడ్ రూమ్‌లోనే గ్యాస్ సిలిండర్ ఉందని పోలీసులు చెబుతున్నా ఆసిలిండర్ కాలినట్లు ఏ మాత్రం మరకలు లేవన్నారు. మృతురాలి ఇంటి నుంచి పొగ బయటికి వచ్చిన నిమిషాల్లోపు ప్రత్యక్ష సాక్షులు ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఏ మాత్రం కదలకుండా పడి ఉన్న మృతదేహాలను చూశామని, ప్రత్యక్ష సాక్షులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. సాధారణంగా ఆత్మహత్యకు పాల్పడిన వారు చివరి క్షణంలో దిక్కుతెలియక పరుగులు పెట్టడం, కేకలు వేయడం జరుగుతుంటాయి. కానీ ఇలాంటి ఆధారాలు ఏమీ తమ దృష్టికి రాలేదన్నారు. కువైట్‌లో ఉన్న భర్త పెట్టే వేధింపులు తాళలేక రమాదేవి పిల్లలతో ఆత్మహత్య చేసు కున్నట్లు పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. కానీ రమాదేవి చనిపోయేందుకు నాలుగైదు గంట ల ముందు అదే వీధిలోని మరొక మహిళతో మృ తురాలికి ఘర్షణ జరిగిందని, తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని మృతురాలి ఇంటి ఎదుట రాత్రి రెండు గంటల వరకు రభస చేసి మృతురాలి ఇంటి తలుపులు పగలగొట్టే ప్రయత్నం చేసిందని లోపల చస్తావా..? బయటకు వచ్చి నా చేతిలో చస్తావా..? అని గట్టిగా కేకలు వేసినట్లు కమిటీ దృష్టికి వచ్చిందని తెలిపారు. అనంతరం కువైట్‌లో ఉన్న మృతురాలి భర్త కంట్రోల్‌లో పనిచేస్తున్న సీసీ కెమెరాలు ఆపేసిన విషయం కూడా తెలిసిందన్నారు. అనంతరం రమాదేవి తెల్లవారుజామున తల్లీబిడ్డలు శవాలై తేలినట్లు కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. మృతురాలిపై గొడవకు దిగిన మహిళ భర్తకు మృతురాలు లక్షలాది రూపాయలు అప్పుగా ఇచ్చినట్లు ఇటీవల తన డబ్బు తనకు వెన క్కి ఇవ్వాలని మృతురాలు తీవ్రంగా ఒత్తిడి చేసిందని కమిటీ విచారణలో తేలింది. మృతురాలిపై దాడికి దిగిన మహిళ భర్త తన గొంతుకోసుకుని ఆస్పత్రి పాలైనట్లు కూడా కమిటీ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. జరిగిన దారుణ సంఘటనపై ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పోలీసులు ఉన్నత స్థాయి అధికారుల చేత విచారణ జరిపి తల్లీబిడ్డల మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ కమిటీ బృందంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెం కటేశ్వర్లు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, ఎంఆర్‌పీఎస్ జా తీయ నేత రామాంజనేయులు, పౌరహక్కుల సం ఘం ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి రాయచోటి రవిశంకర్, మోటపోతుల రవిశంకర్, ఇర్షాద్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబీకులను విచారిస్తున్న నిజనిర్ధారణ కమిటీ బృందం

అక్కినేని ఒక విశ్వవిద్యాలయం

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో వక్తలు





అక్కినేని అభిమానుల నడుమ కళాక్షేత్రంలో అక్కినేని శత జయంత్యుత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 18: అక్కినేని నాగేశ్వర్‌రావు ఒక విశ్వవిద్యాలయమని, ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సి అంశాలు ఎన్నో ఉన్నాయని ప్రముఖ వక్తలు అన్నారు. రాయలసీమ అక్కినేని అభిమానుల సమాఖ్య ఆధ్వర్యంలో దివంగత మహానటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంత్యుత్సవాలను ఆదివారం కడప కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు అక్కినేని సినిమాల్లోని హిట్ పాటల కచేరి నిర్వహించారు. సాయంత్రం 4గంటల నుంచి అక్కినేని హిట్ సినిమాల పాటల క్లిప్‌లను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. తరువాత చిత్తూరు జిల్లా సిమ్మిసామ గ్రామం విద్యార్థులచే అక్కినేని సినిమా పాటలకు అభినయం చేసి అభిమానులు, ఆహూతులను మెప్పించారు. జూనియర్ అక్కినేని స్మామాట్, స్టేజీ ఆశాలచే ప్రదర్శనలు చేశారు. రాయలసీమ అక్కినేని అభిమానుల సమాఖ్య సభ్యులు శ్రీకంఠం మణిబాబు, వి.ఓంనమశ్శివాయ, కడప రామక్రిష్ణ ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సమావేశంలో ప్రముఖ వక్తలు మాట్లాడుతూ మనిషి అన్న తరువాత కాసింత కళాపోషణ ఉండాలన్నారు. అక్కినేని ఒక విశ్వవిద్యాలయం అన్నారు. ఆయన వద్ద నటన మాత్రమే కాదు.. ఎంతో విజ్ఞానం కూడా దాగిఉందన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు మల్లికార్జునరెడ్డి, ఈశ్వరరెడ్డి, ఇన్‌టాక్ కన్వీనరు లయన్ చిన్నపరెడ్డి, మృత్యుంజయరావు, సవేరా ఆర్ట్స్ వెంకటయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు. తరువాత సీనియర్ అభిమానులు, ముఖ్యమైన వక్తలకు సన్మానం చేశారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరికి గాయాలు

పెండ్లిమర్రి, ఆగస్టు 18: చిన్నదాసరిపల్లె సమీప వంక వద్ద నీళ్ల ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ఆదివారం పాతసంగటిపల్లె వాసి గుణవర్ధన్‌రెడ్డి వెయ్యినూతలకోన దేవస్థానంలో బంధువుల వివాహానికి నీళ్ల ట్యాంకర్ తీసుకెళ్లాడు. తిరిగి ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకుని వస్తుండగా వంక వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ వంకలో బోల్తాపడింది. ట్రాక్టర్ అతని మీదపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరుకు తరలించారు.

బస్‌షెల్టర్ల నిర్మాణం కోసం రూ.19లక్షలు మంజూరు

పులివెందుల టౌన్, ఆగస్టు 18: స్థానిక మెడికల్ కళాశాల వద్ద బస్‌షెల్టర్ల నిర్మాణానికి రూ.19లక్షలు మంజూరైంది. ఈ మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీచేశారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎమ్‌ఎఫ్) ట్రస్ట్ గ్రాంట్ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణలో రెండువైపుల బస్‌షెల్టర్ల నిర్మాణం సాగనున్నాయి.

మద్యం మత్తులో దాడి ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నూరు, ఆగస్టు 18: చెన్నూరు హైవే కొత్తరోడ్డుపై ఆదివారం రాత్రి మద్యం మత్తులో నలుగురు యువకులు మరో యువకుడిపై దాడి చేయడంతో అతను తీవ్రగాయాల పాలయ్యాడు. సీఐ పురుషోత్తంరాజు వివరాల మేరకు... చెన్నూరు కొత్తరోడ్డుకు చెందిన గంధం సుబ్బరాయుడు అలియాస్ పెద్దచిలక ఆలంఖాన్‌పల్లె సర్కిల్‌లోని దండు వద్ద ఆదివారం సాయంత్రం మద్యం తాగుతుండగా చెన్నూరు వాసులు పేరం రాజా, ప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, మరొకరు కలిసి ఏదో మాట్లాడదామని సుబ్బరాయుడిని చెన్నూరుకు పిలిపించుకున్నారు. కొత్త రోడ్డు పెట్రోలు బంకు సమీపంలో మళ్లీ ఐదుగురు కలిసి మద్యం తాగారు. ఈ మత్తులో సుబ్బరాయుడిపై ఉన్న వ్యక్తిగత కక్షలతో మాటామాటా పెంచుకుని ఘర్షణకు దిగారు. సుబ్బరాయుడిని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 18: ప్రొ ద్దుటూరులో ఇసుక రవాణా ఆగడం లేదు. రామాపురం, పెద్దశెట్టిపల్లె, చౌట పల్లె, దొరసానిప ల్లె, రామేశ్వరం, పె న్నానగర్, నంగనూ రు పల్లె, కల్లూరు, రేగళ్ళ పల్లె ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పెన్నానది నుంచి ఇసుకను రాత్రిళ్లు తవ్వకాలు జరిపి రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇసుక మాఫి యా తీరు మారలేదు. వారం రోజులుగా పోలీసులు జరిపిన దాడుల్లో రూరల్ స్టేషన్ పరిధిలో 7 ట్రాక్టర్లును పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు మృతి



షరీఫ్ మృతదేహం

మైదుకూరు రూరల్ (దువ్వూరు) ఆగస్టు 18: కృష్ణంపల్లి వాసి షరీఫ్ (42) దువ్వూరులోని ఓ వివాహానికి హాజరై ఇంటికి ఆటోలో వెళ్లా డు. కానగూడురు వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో షరీఫ్ అక్కడిక్కడే మృ తి చెందాడని దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమా ర్ తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు అయన తెలిపారు.

జిల్లాలో సీఐలు, ఎస్ఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 18 : కడప జిల్లా వ్యాప్తంగా ఏడుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
నరేంద్రరెడ్డి	వీఆర్ అనంతపురం	పీసీఆర్ కడప
అశోక్‌రెడ్డి	డీఎస్బీ	వీఆర్ కడప
నారాయణయాదవ్	ఆర్ఎస్‌టీఎస్, కడప	వీఆర్ కడప
ఈశ్వరయ్య	వీఆర్, కడప	దిశ, మహిళ, నంద్యాల
శంకరయ్య	ఫ్యాక్షన్ జోన్, కడప	వీఆర్, కడప
దేవకిరణ్‌కుమార్	సైబర్‌క్రైం, కడప	ప్రొద్దుటూరు, ట్రాఫిక్
అబ్దుల్‌నాయక్	ప్రొద్దుటూరు ట్రాఫిక్	సైబర్‌క్రైం, కడప

ఎస్ఐ పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
కె.శ్రీకాంత్	శ్రీసిటి పోలీస్, తిరుపతి	బద్వేలు రూరల్
పి.వెంకటసురేష్	వీఆర్, కడప	ప్రొద్దుటూరు రూరల్
డి.సునీల్‌కుమార్‌రెడ్డి	వీఆర్, కడప	సైబర్ క్రైమ్, కడప
సి.లక్ష్మినారాయణ	వీఆర్, కడప	తలమంచిపట్నం
సి.ద్వారక	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు
ఈ.వెంకటయ్య	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
వి.మల్లిఖార్జునరెడ్డి	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
బి.ప్రదీప్‌కుమార్	వీఆర్, కడప	డీటీఆర్‌బీ, కడప
ఎస్.శ్రీధర్‌బాబు	వీఆర్, కడప	డీటీసీ, కడప
పీఎస్ రాజ్‌కుమార్	వీఆర్, కడప	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, కడప
బి.ప్రకాశ్‌రావు	వీఆర్, కడప	సీసీఎస్, కడప
పి.నారాయణ	వీఆర్, కడప	సీసీఎస్, కడప
ఎంవీ సుబ్బన్న	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
ఎస్.అనసూయ	దిశ పీఎస్	పీసీఆర్, కడప
వి.లక్ష్మీదేవి	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
పి.హైమావతి	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
కె.శాంతమ్మ	వీఆర్, కడప	ఏహెచ్‌టీయూ, కడప

అనుబంధాల రక్షాబంధన్

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి అని, రక్షాబంధన్ అని పిలుస్తారు. కుటుంబంలో అనుబంధాలను గుర్తు చేసుకుంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలని రక్షాబంధన్ చేసుకుంటారు. అంతేకాకుండా జీవితంలో తమకు రక్షగా నిలవాలని, జీవితాంతం ఒకరికి ఒకరు తోడుంటామని చాటిచెప్పేందుకే సోదరీ మణులు అన్నదమ్ములకు రక్షాబంధన్ కడతారు. దీంతో సంతుష్టులైన అన్నదమ్ములు శక్తి మేరకు కానుకలు అందిస్తారు. రాఖీ కట్టేముందు 'యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః - తేనత్వామభిబధ్నామి రక్షే మా చల మా చల' అని మంత్రం చెప్పి రాఖీ కడితే రాకీ కట్టించుకున్న వారికి రక్షగా నిలుస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అంటే 'అత్యంత దయ కలిగిన రాజు బలికి కట్టినఅదే పవిత్రమైన దారాన్ని నేను రనీ మణికట్టుకు కడుతున్నాను. అది నిన్ను కష్టాల నుంచిశాశ్వతంగా కాపాడుతుంది' అని ఈ మంత్రం అర్థం

రాయచోటి(సంబేపల్లె). ఆగస్టు18: సోదర భావం అపురూప సుమం. దానికి ఆత్మీయత అనే గంధం అద్దితే కనిపించే సుందర రూపమే రక్షాబంధన్. రాఖీ పౌర్ణమి సోదరీ సోదరుల అనుబంధ సూచికంగా శ్రావణి పౌర్ణమి నాడు చేసుకునే పండుగ. శ్రావణ పౌర్ణమికి భారతీయ సనాతన సంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. యుగయుగాలుగా తరతరాలుగా ఈ పర్వదినం అనేక అద్భుత సందర్భాల సమాహారంగా పవిత్ర ఘట్టాలను ప్రతిబింబిస్తోంది. ధర్మ రక్షణ కోసం జరిగిన అవతరణాలు ఆధారంగా నిలుస్తోంది. అన్నకు గానీ, తమ్మునికి గానీ ప్రేమ సూచికంగా సోదరి రాఖీ రక్షణ కట్టడం. ఈ పండుగలోని ప్రధానాంశం. రాఖీ అనే పదం రక్ష లేదా రక్షణ సంబంధమైనది. సోదరి తన సోదరుడి చేతికి రక్షణ సంబంధించి కలకాలం చల్లగా ఉంటూ తనకు రక్షణను కల్పించమని మనస్ఫూర్తిగా కోరుకోవడమే ఈ పవిత్ర కార్యం వెనుక ఉన్న అంతరార్థం. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున రక్షాబంధన్ పండుగ చేసుకుంటారు. అయితే పురాణాలప్రకారం అసలు ఈ పండుగ చేసుకోవడం ఎప్పటి నుంచి మొదలైంది.

రాఖీ పండుగ ఎలా మొదలైంది

రాఖీ పండుగ వస్తుందంటే చాలు ఎక్కడ చూసినా రకరకాల రాఖీలు దర్శనమిస్తూ ఉంటాయి. ఏ షాపులో చూసినా అందమైన రాఖీలు కనిపిస్తాయి. స్వస్తిక్ గుర్తు రాఖీలు, పూసలు, రంగురాళ్లు, బొమ్మలతో ఉండే అనేక రాఖీలు, ఇప్పుడు మార్కెట్‌లో ఉంటున్నాయి. అయితే తొలి రాఖీ దేనితో కట్టారో తెలుసా..? చీర కొంగుతో కట్టారు. అప్పటి నుంచి ఈ పండుగను చేసుకుంటూ వస్తున్నారు. పూర్వం రాఖీ అంటే రంగుదారంతో కట్టేవాళ్లు.



రక్షాబంధన్ పండుగ ఎలా మొదలైంది

ఇది తొలుత ఉత్తర భారతదేశంలో విశేష ప్రచారంలో ఉంది. ఉత్తర భారతదేశంలో పురాణ సంప్రదాయాలు ఈ పండుగ వెనుక రక్షాబంధన్ గురించి చాలాకథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. మతవిశ్వాసాల ప్రకారం రక్షాబంధన్ కృష్ణుడు ద్రౌపదితో ప్రారంభమైందని నమ్ముతారు. శ్రీకృష్ణుడు దుష్టరాజు, శిశుపాలుడుని చంపాడు. యుద్ధ సమయంలో కృష్ణుడి ఎడమ చేతి వేలికి గాయమై రక్తం కారుతోంది. అది చూసిన ద్రౌపది చాలా దుఃఖించి తన చీర కొంగును చింపి ఆ ముక్కను కృష్ణుడి వేలికే కట్టడంతో రక్తస్రావం ఆగింది. అప్పటి నుంచి కృష్ణుడు ద్రౌపదిని తన సోదరిగా అంగీకరించాడు. పాండవులు జూదంలో ద్రౌపదిని ఓడిపోయినప్పుడు ఆమెను నిండు సభలో వివస్త్రను చేసేందుకు ప్రయత్నించారు. అప్పుడు కృష్ణుడు ద్రౌపది మానాన్ని కాపాడాడడంతో రాఖీ పండుగ మొదలైందని అంటారు.

బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఆగస్టు 18: పులివెందులలోని నగరిగుట్ట ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు, సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ సరిగ్గా లేదని విద్యార్థులు ఎమ్మెల్సీకి తెలియజేశారు. హాస్టల్ వార్డన్ విధులకు హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వసతి గృహాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే విధులకు హాజరుకాని వార్డన్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు.

'రేపటి ధర్నాను విజయవంతం చేయండి'

కడప (మారుతీనగర్), ఆగస్టు 18 : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ కింద రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న పీఎఫ్ కార్యాలయంలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి వై.రవీంద్రనాథవర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలకు పైగా ఆర్టీసీలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయినప్పటికీ పెన్షన్ కింద వెయ్యి నుంచి రూ.3వేలు మాత్రమే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబాలు గడవటం కష్టమైందని, పెన్షన్ కింద రూ.9 వేలు అందేలా చూడాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న విజయ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18: కమలాపురం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని కె.హారికకు అదే కళాశాల సివిక్స్ అధ్యాపకురాలు బి.విజయ రూ.10,116 అందించారు. 2023-24 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో 930 మార్కులు సాధించినందుకు ప్రోత్సహిస్తూ ఆ నగదును అందించారు.

రిజిస్ట్రారుగా వెంకటేశ్వర్లు



కట్టా వెంకటేశ్వర్లు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18:వైవీయూ కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ వెంకటేశ్వర్లును కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రారుగా నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు హైదారాబాదు ఐఐటీలో పీహెచ్‌డీ చేసిన ఈయన సౌత్‌కొరియాలోని కియో నేషనల్ యూనివర్సిటీలో పోస్టు డక్టోరల్ ఫెలోషిప్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుకు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, ఉప ప్రధాన అచార్యులు ప్రొఫెసరు పద్మ అభినందించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● చెక్కభజనలు, కోలాటాలతో కోలాహలంగా గ్రామోత్సవం

సింహాద్రిపురం, ఆగస్టు 18: సింహాద్రిపురం వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రెండో రోజు వేద పండితులచే వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహిం చారు. ఆదివారం ఉదయాన్నే, హోమ పూజలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ స్థాపన చేశారు. మధ్యాహ్నం నుంచి వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం సింహాద్రిపురం పుర వీధుల వెంట చెక్కభజనలు, కోలాటాల బృందాలు, ప్రత్యేక భజన బృందాలచే కోలాహలంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిర్వహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.





స్వామి వారి ప్రతిష్ఠలో హోమం... ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న భక్తులు... ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తి

డాక్టరుపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18 : దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్ర్భాంతికి గురి చేసిన వైద్యకళాశాల జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వం ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ మౌమిత విధుల్లో ఉన్న సమయంలో దుండగులు అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం యావత్ దేశమంతటా కలిచివేసిందన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించి తమ పదవులకు రాజీనమా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు వెంకటేశ్, తేజా, దస్తగిరి, ఇర్ఫాన్, హాస్టలువిద్యార్థినిలు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న టీఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు

డాక్టర్ మౌమిత మరణానికి కారణమైన వారిని ఉరి తీయాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 18 : కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థిని మౌమిత మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఇండియా మై డ్యూటీ సొసైటీ అధ్యక్షులు షేక్ మౌలాలి, సయ్యద్ చాన్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఉర్దూ మున్సిపల్ హైస్కూలు సమీపంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై అ రాచకలు పెరిగిపోతున్నాయన్నారు. స్వాతంత్ర్య భారతదేశంలో మహిళలకు రక్ష ణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మౌమిత మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునారవృతంకాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రరాష్ట్ర ప్రభత్వాలై ఉందన్నారు. అలాగే వైద్యవిద్యార్థుల కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రసూల్, ఆదిల్, కరీం, అబ్దుల్, తాజుద్దీన్, ఖాజా, వంశీ, శ్రీను పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ చేస్తున్న సొసైటీ ప్రతినిధులు

రైతు బజార్ వద్ద నిరసన



రైతు బజార్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, రైతులు

వేంపల్లె, ఆగస్టు 18: వేంపల్లె రైతు బజార్ వద్ద బీజేపీ నాయకులు,రైతులతో కలిసి నిరసన తెలిపారు. రైతు బజార్‌ను ప్రారంభించకుండా స్థానిక పంచాయతీ అధికారులు అడ్డుకుంటున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం రైతు బజార్ ఎదుట రైతులు, బీజేపీ నాయకులు నోటికి నల్లగుడ్డ కట్టుకొని నిరసన తెలిపారు. రైతులకు ఉపయోగపడే రైతు బజార్‌ను ప్రారంభించేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతు బజార్ ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపయోగంలోకి తెస్తే రైతులకు మేలలు జరుగుతుందని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విషయపరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18:సైన్స్ ఉపాధ్యాయులు నిరంతరం విషయపరిజ్ఞానాన్ని పెంచుకోవాలని తద్వారా తరగతి గదిలో విద్యాబోధన కొనసాగించగలరని సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీవీ క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ క్లబ్ డివిజను సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి భౌతిక శాస్త్రం నూతన టెక్స్ట్ బుక్ కొన్ని కఠిన అంశాలపై టి.రామచంద్ర రసాయనశాస్త్ర అధ్యాపకులు మాట్లాడారు. తనతో పాటు సైన్స్‌క్లబ్‌కు సంబంధించిన మరికొన్ని విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్‌క్లబ్ కడప డివిజను అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, సెక్రటరీవిజయ ప్రసాద్, మాజీ సైన్స్ ఆఫీసర్లు రెహ్మాన్, నిత్యానందరెడ్డి, సైన్స్ క్లబ్ మహిళా కార్యదర్శి సుజాతారాణి, సనావుల్లా, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే మా లక్ష్యం

● ఆవిర్భావ దినోత్సవంలో మాజీ మున్సిపల్ చైర్మన్

కడప (మారుతీనగర్), ఆగస్టు 18 : సమాజంలో అసమానతలు లేని సమాజమే మా లక్ష్యమని మాజీ మున్సిపల్ చైర్మన్ హరీంద్రనాథ్, ఏపీ బీసీ మహాసభ జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున పేర్కొన్నారు. దళిత ఉద్యమాల్లో యువత భాగస్వామ్యం కావాలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో దళితమిత్ర సంఘం ఏడవ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యారంగాల్లో వెనుకబడ్డ దళితులను పాలక ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. దళితులు నేటికీ అ భివృద్ధికి ఆమడ దూరంలో ఉండడం బాధాకరమన్నారు. ఏపీ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు బాలసుబ్బయ్య, కొత్తపల్లె యల్లయ్య పాల్గొన్నారు

నేటి యువతకు స్ఫూర్తి నాగిరెడ్డి రచనలు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 18 : ఎంసీ నాగిరెడ్డి రచించిన శతక మధురిమలు,బంధాలు - బాధ్యతలు పుస్తకాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని సినీ నిర్మాత కె.బాబురెడ్డి అన్నారు. కడప సర్వేపల్లి రాధాక్రిష్ణ నగర్‌లో ఉన్న రామక్రిష్ణ వానప్రస్థాశ్రమంలో ఆదివారం ఉదయం శతక మధురిమలు, బంధాలు - బాధ్యతలు రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాబు రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజం పట్ల, గురువుల పట్ల, తల్లిదండ్రుల పట్ల యువతకు ఉండాల్సిన బాధ్యతలు రచయిత గుర్తు చేశారన్నారు. సభాధ్యక్షుడిగా ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు మర్యాద, గౌరవం, ఓర్పు, సహనం, దాతృత్వం, దైవభక్తి, దేశభక్తి తదితర గుణాలు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలన్నారు. డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి శతక మధురిమలు పరిచయం చేస్తూ వేమన, సుమతి, కుమార, భాస్కర, నరసింహ శతకాల్లోని ముఖ్యమైన పద్యాలను ఏర్చి కూర్చి వాటికి వ్యాఖ్యానం రాసి విద్యార్థులకు అందించడం సంతోషకరమన్నారు. అలాగే డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి బంధాలు-బాధ్యతలు పరిచయం చేస్తూ తల్లిదండ్రుల సమయస్ఫూర్తి, ప్రేమలు, పెళ్లిళ్లు, ఉద్యోగ నిర్వహణ తదితర అంశాలను చక్కగా వివరించారన్నారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ మహేశ్

కడప (కల్చరల్), ఆగస్టు 18 : సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాస్టర్ మహేశ్ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక బిల్డప్ సర్కిల్ సమీప కృపాకాలనీలో గల న్యూనేటివ్ కృపాచర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో కూడా ఎండలు విపరీతంగా కాయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దేవుడు త్వరితగతిన ఎండలు తగ్గేలా చేసి వానలు కురిపించాలని ఆ భగవంతున్ని వేడుకున్నానన్నారు. కార్యక్రమంలో రవితేజ, అగస్టీన్, శాంతిరాజ్, రేజా పాల్గొన్నారు.


బాపట్ల కలెక్టర్‌ను కలిసిన బీటెక్ రవి



కలెక్టర్‌ను సత్కరిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఆగస్టు 18: బాపట్ల జిల్లానూతన కలెక్టర్ జె.వెంకటమురళిని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం వివాహం సందర్భంగా పులివెందులకు వచ్చిన బాపట్ల జిల్లా కలెక్టర్‌ను స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో బీటెక్ రవి కలిసి శాలువతో సత్కరించారు. బాపట్ల జిల్లాకు కలెక్టర్ బాధ్యతలు తీసుకున్నందున శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అజ్జుగట్టు రఘునాథరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్



ఎమ్మెల్యే మాధవికి కానుక అందిస్తున్న బ్రహ్మకుమారీలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18:ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సేవా కేంద్రం రాజయోగిని బీకే గీతా బ్రహ్మకుమారీ ప్రదీపలు రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిశారు. ఆదివారం మాధవీరెడ్డి స్వగృహంలో ఆమెను కలిసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టి ఈశ్వరీయ కానుకను అందించారు.

దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ చంద్ర

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18:దళితుల సంక్షేమ పథకాలను పునరుద్దరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారం చేపట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభివృద్ది సంక్షేమ పథకాలను అమలు చేయకుండా 27 సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా నిలుపుదల చేసిందన్నారు. దళిత బహుజనుల అభివృద్ధికి మొండిచేయి చూపిందన్నారు. నవరత్నాల పేరు చెప్పి ప్రజలకు మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు దళితులను నమ్మించి వారి అభివృద్ధికి తోడ్పడతామని చెప్పి అధికారం వచ్చాక పథకాలు అమలు చేయంకుండా ద్రోహం చేశారన్నారు. ప్రస్తుతం ఉన్న టీడీపీ ప్రభుత్వం వైసీపీ నిలుపుదల చేసి సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, అధ్యక్ష కార్యదర్శులు ఇమ్మానుయేల్, మునెయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, పెంచలయ్య పాల్గొన్నారు.

రక్తదాన స్ఫూర్తిప్రదాత మెగాస్టార్ చిరు

● జనసేన నాయకుడు తుంగా రమణయ్య



రక్తదాన శిబిరంలో పాల్గొన్న తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18 :రక్తదాన స్ఫూర్తిప్రదాత మెగాస్టార్ చిరంజీవి అని జనసేన నాయకుడు తుంగా రమణయ్య అన్నారు. ఆదివారం కడప నగరం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో మెగాస్టార్ పుట్టినరోజు వారోత్సవాల సందర్భంగా చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పంద్ర రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రక్తం కొరత తీవ్రంగా ఉన్న సమయంలో మంచి ఆలోచనతో అభిమానులను సేవామార్గం వైపు నడిపించేలా చిరంజీవి బ్లడ్‌బ్యాంకు ద్వారా రక్త కొరతను తీర్చి అనేక మందికి ప్రాణవాయువు అందించారని కొనియాడారు. రక్తదాతలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని అటువంటి వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని ఆయన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి అనేకమందికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. చిరు యువత జిల్లా అధ్యక్షుడు పంద్ర రంజిత్ మాట్లాడుతూ చిరంజీవి ఆశయాలకనుగుణంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్బన్న, రాజగోపాల్, గురుశేఖర్, గొద్దెల సాయి, రామసిద్దు, లక్ష్మీరామ్, సిద్దార్థ, నాగేంద్ర, బాలు, హరి, సుధాకర్, విఘ్నేశ్, సుధీర్, మనోహర్, తరుణ్ పాల్గొన్నారు.

మరిన్ని ప్రశంసలు అందుకోవాలి



సురేశ్‌ను సత్కరిస్తున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 18 : జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి అందెల సురేశ్ మరిన్ని ప్రశంసలు అందుకోవాలని ఏపీ రాష్ట్ర మాలమహానాడు జాకట విజయశేఖర్ వర్గం రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేశ్, జిల్లా అధ్యక్షుడు పాలెం సంజీవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడు డేవిడ్ సత్యరాజ్, ఏకాసి బాబు, రాజశేఖర్, మల్లి, సుధాకర్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ అదితిసింగ్ చేతుల మీదుగా మెమెంటో, సేవాపత్రం అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌కు ఆదివారం వారు శుభాకాంక్షలు తెలుపుతూ పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇల్లూరి సురేశ్ మాట్లాడుతూ జిల్లా ఉపాధి కార్యాలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా విధులు నిర్వహించి తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

పార్వతీపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులను సత్కరించి ఆత్మీయానురాగాలను పంచుకుంటున్న పూర్వ విద్యార్థులు

రాజంపేట, ఆగస్టు 18 : పార్వతీపురం ఎస్‌బీవీడీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1971-72, 75-76 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు కేవీ ప్రసాద్, తిరు వెంగలయ్య, సంజీవయ్య, చేపూరి బాలకృష్ణయ్య, అప్పటి సిబ్బంది రంగయ్య హాజరయ్యారు. నాటి హెడ్మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, బోడగాల నారాయణ, మేరువ లీలాకృష్ణయ్య, వెంకటయ్య, సుబ్బన్న, కేశవులు స్మరించుకుని వారికి ఘనంగా నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ప్రస్తుత హెడ్మాస్టర్ ఏడీ మధుసూదన్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు బోడా దామోదర్, సుబ్బయ్య, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బమ్మ, సుబ్బరాయుడు, శ్యామల వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని పర వశించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శిల్పారామంలో అలరించిన ఆటాపాటా




పులివెందుల: ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లోని శిల్పారామంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



కడపలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల రూరల్, ఆగస్టు 18: పులివెందులలోని ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో డ్యాన్స్ మాస్టర్ చిట్టి నేతృత్వంలో పులివెందుల ఎక్స్‌లెంట్ నాగార్జున స్కూల్ విద్యార్థులు సినిమా పాటలకు నృత్యం చేశారు. గణనాయకాయ గణదైవాయ గనక్షాయ ధీమహి, కుర్చీని మడత, ఎందుకో పిచ్చిపిచ్చిగా, సారంగ దరియా అంటూ తదితర సినిమా పాటలకు వేసిన నృత్యం సందర్శకులను ఆకట్టుకున్నాయి.

కడపలో... కడప (కల్చరల్), ఆగస్టు 18 : కడప నగరం రిమ్స్ సమీపంలోని శిల్పారామం కళావేదికపై ఖాజీపేటకు చెందిన వరల్డ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ జానపద సినీ పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆహూతుల కరతాళధ్వనులతో శిల్పారామం మార్మోగిపోయింది.

అర్బన్ సీఐగా లింగప్ప



జమ్మలమడుగు, ఆగస్టు 18: జమ్మలమడుగులో ఆదివారం సాయంత్రం 7 గంటలకు కొత్తగా అర్బన్ సీఐ ఎస్.లింగప్ప బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి బదిలీపై జమ్మలమడుగు అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కరుణాకర్ కడపకు బదిలీ అయ్యారు.

మద్యంసీసాలు స్వాధీనం

రాజుపాలెం, ఆగస్టు 18 :మండల పరిధిలోని గోపాయపల్లెకు చెందిన చిన్నవీరయ్య నుంచి ఆదివారం 16 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా విధుల్లో చేరడంతో పాటు అంతకు ముందు గ్రామాల్లో అరకొర బెల్టుషాపులు నడుపుతుండడంతో వాటిపై దృష్టి సారించడంతో క్రమక్రమంగా నిర్మూలన చేసేందుకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రొద్దుటూరు, ఆగస్టు 18 : మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన అభిమానులు ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు వైద్యుడు గోపాల్ మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎందరో అభాగ్యులకు మేలు జరుగుతుందన్నారు. మెగా అభిమానులు ఈ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెగా అభిమానుల సంఘం నాయకులు రామారావు, షరీఫ్, చంద్రధర్, హిమామ్, బాబురావు, మధు, సుబ్బారెడ్డి, శంకర్, రాజు, రాము,జహీర్ ,గౌస్ జనసేన హేమంత్, నాయక్ చెన్నారవి, పల్లారఘు పాల్గొన్నారు.

మార్కెట్‌తో విద్యార్థులకు ఇక్కట్లు

- శబ్ద కాలుష్యం, కూరగాయల వ్యర్థాల దుర్వాసన, ఘాటువాసనతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పాఠశాల మైదానం నుంచి మార్కెట్‌ను తరలించాలని విద్యార్థుల వినతి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 18: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేసిన కొత్త కూరగాయల మార్కెట్‌తో ఆ పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో విద్యావ్యాప్తి కోసం వేంపల్లె వెంకటసుబ్బారెడ్డి 20 ఎకరాల భూమిని ఉచితంగా అందజేశారు. 1914లో ఆ భూమిలో మల్టీ పర్పస్ పాఠశాల ఏర్పాటైంది. తర్వాత అనిబిసెంట్ స్కూల్‌గా పేరు మారి మున్సిపాలిటీలో విలీనమైంది. ఆ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆ పాఠశాల నుంచి ఎంతో మంది విద్యను అభ్యసించారు. కరోనాకు ముందు ఆ పాఠశాల మైదానంలో అనేక రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అనేక బహిరంగ సభలు, రాజకీయ పార్టీల సమావేశాలకు ఆ పాఠశాల మైదానమే వేదిక. ఒకప్పుడు ఉజ్వల భవిష్యత్తును చవిచూసిన పాఠశాలలో కరోనా తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. శివాలయం సెంటర్‌లో ఉన్న మార్కెట్‌ను ఆధునీకీకరించడానికి గత వైసీపీ ప్రభుత్వం ఆ పాఠశాల మైదానంలో మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. కరోనా సమయంలో తాత్కాలిక కూరగాయల మార్కెట్ కోసం పక్కా నిర్మాణాలు చేపట్టారు. పాఠశాలలో తరగతులకు ఆనుకుని మార్కెట్‌ను నిర్మించడంతో విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. మార్కెట్‌లో వ్యాపారుల అరుపులు, కేకలు వాహనాల రణగొన ధ్వనుల శబ్దకాలుష్యంతో విద్యార్థులు బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఉదయం శబ్ద కాలుష్యం మరింత ఎక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు అర్థం కావడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. మార్కెట్‌లో కుళ్లిన కూరగాయల వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. అలాగే ఘాటువాసన భరించలేకపోతున్నారు. శబ్ద కాలుష్యం, వాసన భరించలేక మార్కెట్‌వైపు కిటికీలను మూసి ఉంచుతున్నారు. మార్కెట్ వలన విద్యార్థుల చదువులకు ఇబ్బందిగా ఉండడమే కాక మైదానం కుచించుకుపోయి క్రీడాపోటీలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. వాకర్స్‌కు అనువుగా ఉన్న మైదానం నేడు నడవడానికి వసతి లేకుండా పోయింది. పాఠశాల ప్రాధాన్యతను, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బడి ఆవరణలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను తరలించాలని పాఠశాల విద్యార్థులు, వాకర్స్ కోరుతున్నారు.



పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్

● మార్కెట్‌ను తరలించాలి



మార్కెట్ వలన విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. శబ్దాలు, ఘాటు వాసనలతో బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నాం. మార్కెట్‌ను త్వరగా మరో చోటికి తరలించాలి.

- దత్తు విఘ్నేష్, 9వ తరగతి

● ఘాటువాసనతో అస్వస్థత



మార్కెట్ నుంచి వచ్చే ఘాటు వాసన, దుర్వాసనతో విద్యార్థులు తరచుగా అవస్థకు గురవుతున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అధికారులు కూరగాయల మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలి.

- యశ్వంత్, 9వ తరగతి

మొక్కలు నాటిన 'మానవత'

ఎర్రగుంట్ల, ఆగస్టు 18: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రగుంట్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులోని మహాత్మానగర్ నుంచి కడపరోడ్డులోని రెడ్డినగర్ వరకు ఎన్‌హెచ్ 716లో రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌లో నగరపంచాయతీ ఛైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, అర్బన్ సీఐ నరేష్‌బాబు, కమిషనర్ రామక్రిష్ణయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి మొక్కలు నాటారు. మానవత ఎర్రగుంట్ల యూనిట్, దాతల ఆర్థిక సహాయంతో సుమారు 350 స్టైప్ ట్రీలను నగరపంచాయతీ సిబ్బంది సహకారంతో నాటారు. ఈకార్యక్రమంలో ఛైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రామాంజనేయరెడ్డి, కార్యదర్శి రంగయ్య, మానవత ఆత్మీయ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

93 మందికి ఉచిత వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 18 : పట్టణంలోని డాక్టర్ పాతకోట శ్రీనాథరెడ్డి, డాక్టర్ హరిత ఆస్పత్రిలో 18వ తేదీ ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 93 మందికి పరీక్షలు చేసినట్లు వారు తెలిపారు. గుండె జబ్బులకు సంబంధించి 22 మందికి ఈసీజీ పరీక్షలు, 11 మందికి గుండె స్కానింగ్ చేసి రోగులకు సూచనలు ఇచ్చినట్లు డాక్టర్ శ్రీనాథరెడ్డి తెలిపారు. అలాగే 35 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ హరిత తెలిపారు. రోగులకు సూచనలు అందించినట్లు వైద్యులు తెలిపారు.

బంగ్లాదేశ్‌లోని హిందువులకు రక్షణ కల్పించాలి



బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు, ఆగస్టు 18: బంగ్లాదేశ్‌లోని హిందూ ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీ, వీహెచ్‌పీ , భజరంగ్‌దల్ నాయకులు,హిందూ ధర్మరక్షా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న సరస్వతి విద్యామందిర్ నుంచి ఆర్టీసీ బస్టాండుఅలాగే మైదుకూరు రోడ్డులోని టీటీడీ కళ్యాణ మండపం, నెల్లూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. పురవీధులలో నిరసన తెలియజేస్తూ ప్రభుత్వం రిజర్వేషన్ల నెపంతో ఎలాంటి సంబంధంలేని మహిళలు, చిన్నారులు, వృద్ధులు, హిందువుల ఆస్తులు, ఆలయాలను కాపాడాలని కోరారు. ఈ ర్యాలీలో ఆర్ ఎస్ఎస్ బద్వేలు సంఘచాలక్ రామకోటిరాజు, ఖండకార్యవహ సాకి ఈశ్వరయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, పల్లెంశెట్టి శ్రీనివాసులు, సురేష్‌కుమార్ యాదవ్, తులసి శివానంద, నరసింహ యాదవ్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కుప్పం వెంకటసుబ్బారావు, బలిజసేవా సంఘం అధ్యక్షుడు దద్దం వెంకటేశ్వర్లు (డి.వి.) , పెద్ది సుధాకర్, బాసికాల శ్రీనివాసులు, ముఖం శ్రీనివాసులు, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, కేఆర్ గ్రూప్ అడ్మిన్ హరిక్రిష్ణ, వెంకటశివనారాయణ, నాగేంద్ర, శివకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన ఎస్ఐగా హనుమంతు



కాశినాయన ఆగస్టు18: కాశినాయన మండల ఎస్ఐగా పి.హనుమంతును ప్రభుత్వం నియమించింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ అమర్‌నాథరెడ్డి కడప వన్ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి తలమంచిపట్నంలో విధులు నిర్వహిస్తున్న పి.హనుమంతు బదిలీపై కాశినాయనకు వచ్చారు. ఆమేరకు ఆదివారం ఆయన నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

బహిరంగప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

పోరుమామిళ్ల ఆగస్టు 18 : బహిరంగప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. ఆదివారం పోరుమామిళ్లలో వేర్వేరు బహిరంగప్రదేశాలలో మద్యం తాగుతున్న 8 మందిపై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

21న భారత్‌బంద్ విజయవంతం చేయండి

జమ్మలమడుగు, ఆగస్టు 18: ఈనెల 21న భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరశిస్తూ భారత్ బంద్ అన్ని కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మురుగునీరు తొలగించరా..?

జమ్మలమడుగు, ఆగస్టు 18: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం పురాతన శివాలయం వద్ద నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. సిమెంటు రోడ్డు ఉన్నా రోడ్డు తగ్గుపడడంతో వర్షపునీరు రోడ్డు పొడవునా నిలుస్తున్నాయి. దాని సమీపాన ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పారిశుధ్యం పడకేసింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని, నిలిచిన వర్షపునీటిని తొలగించేందుకు పక్కనే కాలువలాగా తీసి ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యను గత మూడు సంవత్సరాలుగా కన్నెలూరులోని కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి మున్సిపల్ సమావేశంలో డ్రైనేజీపై, పారిశుధ్య చర్యలపై అధికారులకు తెలియజేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



కన్నెలూరు ఎస్సీ కాలనీ రోడ్డులో నిలిచిన వర్షపునీరు



కన్నెలూరు ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే దారి నిలువ ఉన్న వ్యర్థాలు

అధ్వానస్థితిలో పొట్టిపాడు రహదారి

కొండాపురం, ఆగస్టు 18: మండలంలోని పొట్టిపాడు-తిమ్మాపురం గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ఘోరంగా దెబ్బతింది. వైసీపీ ప్రభుత్వంలో పొట్టిపాడు వద్ద ఇసుకరీచ్ ఉండటంతో టిప్పర్లతో రోడ్డు నాశనమైంది. ఓవర్‌లోడుతో టిప్పర్లు ఇసుక తీసుకెళ్లడంతో రోడ్డు ఘోరంగా దెబ్బతిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్డుకిరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డంతా గుంతలమయమై ద్విచక్రవాహనాలు, పాదచారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రహదారిపై టిప్పర్లు వెళ్లవద్దని స్థానిక ప్రజలు ఆందోళన కూడా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొత్త ఎన్డీయే కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కొండాపురం మండలం పొట్టిపాడు- తిమ్మాపురం గ్రామాల మధ ఘోరంగా దెబ్బతిన్న రోడ్డు

సోదర సౌభ్రాతృత్వానికి ప్రతీక రక్షాబంధన్



ఆర్టీపీపీ సీఈకి రాఖీ కడుతున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 18: సోదర సౌభ్రాతృత్వానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఓంశాంతి నిర్వాహకురాలు బీకే సౌజన్య పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఆర్టీపీపీ గౌరిపతి, ఎస్ఈలు, ఎస్ఐ తిమోథిలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగను జరుపుకున్నారు. రక్షా బంధనం యజ్ఞోపవీతం కావడం వల్ల దీన్ని జంధ్యాల పౌర్ణమి, శ్రావణపౌర్ణమిగా జరుపుకుంటారన్నారు.

శీలం గంగన్నకు ఆత్మీయ పురస్కార ప్రదానం



బద్వేలు, ఆగస్టు 18: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఎంఈవో శీలం గంగన్నను సీనియర్ సిటిజన్స్‌డే సందర్భంగా ఆత్మీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో ఆదివారం సంఘ పెద్దలు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో ఆయనను ఘనంగా సత్కరించారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగానికి సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

వృథాగా పోతున్న నీరు

● పట్టించుకోని అధికారులు



ఖాజీపేట, ఆగస్టు 18: నీరు వృథా చేయకుండా పొదుపుగా వాడాలని ప్రభుత్వం చెబుతున్నా అందుకు విరుద్ధంగా అధికారులు పనిచేస్తున్నారు. మండల పరిధిలోని పత్తూరు హరిజనవాడలోని మంచినీటి బోరు వద్ద కొద్దిగా వృథాగా నీరు పోతోంది. అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని, వృథాగా పోయే నీరు మురుగునీరుగా మారి నిలువ ఉందని, ఆ నీరు పైపుల్లోకి వస్తే రోగాల బారిన పడక తప్పదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టి మంచినీటిని అందించాలని గ్రామస్థులు కోరారు.

పడకేసిన పారిశుధ్యం

దోమలు బాబోయ్ దోమలు ●అనారోగ్యం పాలవుతున్న గ్రామీణ ప్రజలు

బి.కోడూరు, ఆగస్టు 18 : గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధికంగా దోమలు పెరిగి గ్రామీణ ప్రజలపై అధికంగా దాడి చేస్తున్నాయి. గత సంవత్సరానికి కంటే ఈ సంవత్సరం వర్షాలు అంతంత మాత్రం అయినప్పటికీ గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో పాటు దోమలు కుడితే శరీరంపై దురదలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామాల్లో మురుగు ఎక్కడికక్కడే తిష్ట వేసి పారిశుధ్యం లోపించి దోమలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వైద్యాధికారులు డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా కొంత మేర ద్రావకం చల్లుతున్నప్పటికీ దోమలు అధికంగా ఉత్పత్తి చెందుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో దోమకాటుకు డెంగీ, మలేరియా వ్యాధులు విజృంభిస్తున్నాయని అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో మురుగు నిల్వ ఉన్న చోట వాటిని తొలగించి మందులు పిచికారీ చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మురుగు నిల్వ ఉన్న చోట అతివేగంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని అంటున్నారు. గతంలో కార్యదర్శులు గ్రామాల్లో తిరిగి మురుగు ఉన్న చోట బ్లీచింగ్ చల్లి కాల్వల్లో మందు పిచికారీ చేసేవారు. అయితే గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి ఉండేది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శులు ఇంత వరకు ఏమీ చేయలేదు. గ్రామ పంచాయతీలకు నిధులు ఉన్నప్పటికీ కార్యదర్శులు పల్లెల్లో తొంగి చూడడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను దోమల బారిన పడకుండా ముందుజాగ్రత్తగా వాటి నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాగా ఈ సీజన్‌లో చాలాకాలం నీళ్లు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి అధికంగా జరుగుతుందని వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఒకవేళ జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు రెండురోజుల కంటే ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు.

దోమకాటుతో పాల ఉత్పత్తి తగ్గుదల..: ఈ సీజన్‌లో దోమకాటు వల్ల పాడిపశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని పశువైద్యాధికారులు పేర్కొన్నారు. అలాగే దోమకాటు వల్ల పెద్ద పశువులు అయితే రక్తహీనత, పారాసైట్ వ్యాధులు, చర్మవ్యాధుల సమస్య వస్తుందన్నారు. అలాగే గొర్రెలు, మేకలకు నోటి జబ్బు, నీలి నాలుక వ్యాధులు వస్తాయన్నారు.



రాజుపాలెంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



తుమ్మలపల్లెలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బ్లీచింగ్ పౌడరు, మందు పిచికారీ చేస్తాం..

పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టేలా చూస్తాం. గ్రామ పంచాయతీలో కొంత మేర నిధులు ఉన్నాయి. ఇంకా గ్రామాలపై దృష్టి పెట్టలేదు. ఇక మీదట గ్రామాల్లో కార్యదర్శులు పర్యటించి బ్లీచింగ్ పౌడరు, మందు పిచికారి చేసి చేయించి దోమలను అరికట్టేందుకు చేస్తాం.

భాస్కర్‌రావు,ఎంపీడీవో